క్లుప్తంగా

వంతెన నిర్మించాలని బీజేపీ నాయకుల ధర్నా

లోకేశ్వరం: శిథిలావస్థకు చేరిన అర్లి వంతెనకు నిధులు మంజూరు చేసి కొత్తది నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం మండలంలోని హావర్గ సమీపంలోని అర్లి వంతెనను ఆమె పరిశీలించి అక్కడే రోడ్డుపై భైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రమాదేవితోపాటు బీజేపీ మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులను అరెస్టు చేసి లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం విద్యార్థినులకు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో 120 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీవో నసీరుద్దీన్, కార్యదర్శి విక్రమ్‌రాజ్, సిబ్బంది వంశీ, అక్బర్, సుగుణ పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి

పెంబి: విద్యుత్‌ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని అంకెనా గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అంకెనాకు చెందిన చౌహన్‌ లక్ష్మీబాయి ఎద్దు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లింది. భారీ వర్షాలకు విద్యుత్‌ తీగలు తెగి పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకున్నారు.

పండ్లు పంచి.. ఇళ్లకు పంపి

ఖానాపూర్: పట్టణంలోని హైటెక్‌సిటీ ప్రాంతంలోని మైనార్టీ రెసిడెన్షియల్‌ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బీఆర్‌ఎస్‌ నాయకులు భుక్య జాన్సన్‌నాయక్‌ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. రెంకోని వాగు పొంగి పొర్లడంతో పాఠశాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులను మరో మార్గం గుండా ప్రధాన రహదారి వరకు తీసుకెళ్లారు. అక్కడ పండ్లు, బిస్కెట్‌ ప్యాకెట్లను జాన్సన్‌ యువసేన సభ్యులు అందజేశారు. అనంతరం విద్యార్థులను వారి ఇళ్లకు పంపించేశారు.

కణితి తొలగింపు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రిలో శుక్రవారం నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన సంపూర్ణ అనే మహిళ కుడి భుజం నుంచి కణితిని ఆపరేషన్‌ ద్వారా తొలగించినట్లు డాక్టర్‌ వరుణ్‌కుమార్‌ పేర్కొన్నారు. మండల ప్రజలు అపెండెక్స్, తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టాఫ్‌నర్స్‌ అపర్ణ ఉన్నారు.

ముగిసిన పీరీల పండుగ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి, పార్‌పెల్లి, మల్లాపూర్, లక్ష్మణచాంద, వడ్యాల్, నర్సాపూర్‌ గ్రామాల్లో పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. పీరీలకు భక్తులు మలిదలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో పీరీల పండుగ శుక్రవారం ముగిసింది. అంతకు ముందు గ్రామస్తులు అగ్నిగుండం వద్ద మలీద ముద్దలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'బురద రాజకీయాలు సరికాదు'

కడెం: రాష్ట్రంలో ఓ వైపు భారీ వర్షాలు కురుస్తుంటే.. ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ నాయకుడు బాదవత్‌ పూర్ణచందర్‌నాయక్‌ అన్నారు. శుక్రవారం కడెం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్‌ నాయకులు, పూర్ణయువసేన సభ్యులు ఉన్నారు.

'ఎమ్మెల్యే రాజీనామా చేయాలి'



కడెం ప్రాజెక్ట్‌ వద్ద జానుబాయి

కడెం: కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించడం చేతకాని స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్‌ రాజీనామా చేయాలని పెంబి జెడ్పీటీసీ భూక్య జానుబాయి ఆరోపించారు. శుక్రవారం కడెం ప్రాజెక్టుకు వెళ్లి మరమ్మతులను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు..ప్రభుత్వ వైఫల్యమే వరదలకు కారణమన్నారు. అనంతరం సీఈ శ్రీనివాస్‌ను కలిసి ప్రాజెక్ట్‌ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అంతకుముందు జెడ్పీటీసీని ప్రాజెక్ట్‌ వద్దకు వెళ్లనీయకపోవడంతో పోలీసులు, బీజేపీ నాయకులకు వాగ్వాదం చోటు చేసుకుంది. రాజేందర్, గంగాధర్, గోవింద్, గోపాల్‌రెడ్డి, భాస్కర్, తదితరులున్నారు.

పెంబి: మండలకేంద్రంతోపాటు పెంబితండా, లోతర్యతాండ గ్రామాల్లో జెడ్పీటీసీ జానుబాయి పర్యటించారు. లోతర్యతాండ వద్ద కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు, పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం పెంబి పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీపీ కవిత, బీజేపీ మండల అధ్యక్షుడు సదాశివ్, రాజేందర్, గోవింద్, రాజు, రమేశ్, తదితరులు ఉన్నారు.

నిండా ముంచిన వర్షం..

- లోకేశ్వరంలో దెబ్బతిన్న రోడ్లు, పంటలు
- మండలంలోని సుద్దవాగుపై నిర్మించిన వంతెనల మీదుగా రాకపోకలు బంద్



వరదకు కొట్టుకుపోయిన సాథ్‌గాం- పెండ్‌పల్లి రోడ్డు

లోకేశ్వరం: భారీ వర్షాలకు గురువారం భైంసాలోని గడ్డెన్న(సుద్ద) వాగు ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తివేయడంతో వరద పొంగిపొర్లింది. లోకేశ్వరం మండలంలోని పుస్పూర్, హథ్‌గాం, సాథ్‌గాం, హావర్గ, మన్మద్, బిలోలి, పోట్‌పల్లి గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, సోయా, పసుపు, మొక్కజొన్న, మినుము, కంది పంటలు కొట్టుకుపోయాయి. పుస్పూర్‌–బోరిగాం, సాథ్‌గాం–పెండ్‌పల్లి గ్రామాల మధ్య సుద్దవాగుపై నిర్మించిన ఇరుకు వంతెనకు ఇరువైపుల రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వర్షానికి కూలిన ఇళ్లు..

లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్‌లో అనూష, లింగవ్వ, గడ్‌చాందలోని భోజవ్వ ఇళ్లు గురువారం వర్షాలకు కూలిపోయాయి. శుక్రవారం ఆర్‌ఐ బాలకిషన్‌ బాధితుల ఇళ్లను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.



అబ్దుల్లాపూర్‌లో కూలిన ఇంటి వద్ద అధికారులు



పుస్పూర్‌లో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌



పంట చేనులో ఇసుక మేటలు

కూలిన ఇళ్లు.. నేలకొరిగిన స్తంభాలు



వాలేగాంలో పోతన్న ఇంటి గోడ కూలడంతో సామగ్రి బయటకు తీసుకొచ్చిన కుటుంబీకులు



వాలేగాంలో పొలంలో విరిగి పడిన స్తంభం



భైంసా: కుంసరలో పంట పొలాల్లో నిలిచిన నీరు

భైంసా/భైంసారూరల్: భైంసా డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షానికి తీరని ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్లు కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. మండలంలోని సిరాల గ్రామంలో మూడు ఇళ్లు, వాలేగాం గ్రామంలో కృష్ణమూర్తి, రాజన్న, పోతన్న ఇళ్లు కూలిపోయాయి. ఇదే గ్రామానికి చెందిన గంగాధర్, జలాల్‌సాబ్, పోతన్న, సాయినాథ్‌ పశువుల పాకలు నేలమట్టమయ్యాయి.

అక్కడక్కడా విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణ..

భైంసా, కుభీర్, తానూరు, బాసర, ముధోల్‌ మండలాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. స్తంభాలు విరిగిపోవడంతో సిబ్బంది అక్కడక్కడా పునరుద్ధరించారు. గుండేగాం వంతెన మునగడంతో రాకపోకలు నిలిపివేశారు. బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి, ముధోల్‌ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. బీజేపీ నాయకులు రామారావుపటేల్, మోహన్‌రావు, బాజీరావు, కాంగ్రెస్‌ నాయకులు ఆనంద్‌రావుపటేల్‌ గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని వారు డిమాండ్‌ చేశారు.

కొట్టుకుపోయిన రోడ్లు, పంటలు



మామడ: కోతకు గురైన నల్దుర్తి–దిమ్మదుర్తి రోడ్డు



దిలావర్‌పూర్: కాల్వ గ్రామంలో పత్తి పంట దుస్థితి



కుభీర్: గొడ్సరలో రోడ్డు వద్ద ఎమ్మెల్యే విఠల్‌ రెడ్డి

మామడ: మండలంలోని నల్దుర్తి నుంచి దిమ్మదుర్తికి వెళ్లే మార్గంలో వంతెన సమీపంలో రోడ్డు కోతకు గురైంది. పొన్కల్‌ నుంచి అనంతపేట్‌ వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించాయి.

దిలావర్‌పూర్: భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న కాల్వ, కాల్వతండా, సిర్గాపూర్‌ గ్రామాల రైతుల పంటలు నీట మునిగాయి. వాగు పరిసరాల్లో వరి నాట్లు కొట్టుకుపోయి.. పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి.

ముధోల్: భారీ వర్షాలకు మండలంలోని గన్నోరాలో మూడు ఇళ్లు, రాంటెక్‌లో నాలుగు, ఆష్టాలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ముధోల్‌ బస్టాండ్‌ ఏరియా, సాయికాలనీలు జలమయమయ్యాయి. బోరిగాం–వడ్తాల్‌ వంతెనపై వరద తో రాకపోకలు నిలిచాయి. ముద్గల్‌–మచ్కల్‌ రోడ్డు మధ్యలోని లోలెవల్‌ వంతెన జలమయమైంది. తరోడాతండా రోడ్డు కోతకు గురైంది.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఊర చెరువు, హకీం చెరువు, పీచర ఊర చెరువు అలుగులు మత్తడి దుంకి పారాయి. కనకాపూర్‌ వాగు పొంగిపొర్లుతుండటంతో చెక్‌ డ్యాం జలపాతాన్ని తలపిస్తోంది.

కుభీర్: గొడ్సర, దార్‌కుభీర్, కస్రా, గాలిసింగ్‌ తండా, పార్డి(బి) రోడ్లు తెగిపోగా ఎమ్మెల్యే జి.విఠల్‌ రెడ్డి, నాయకులు పరిశీలించారు. గొడ్సర వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లమ్మ, దొడర్నా చెరువులకు గండ్లుపడ్డాయి. చేపపిల్లలను నష్టపోయామని కుభీర్‌ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖానాపూర్‌లో మునిగిన వైకుంఠధామం



ఖానాపూర్‌లో నీటమునిగిన వైకుంఠధామం



రెంకోని వాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల మీదుగా ప్రవహించే గోదావరి శుక్రవారం ఉధృతంగా ప్రవహించింది. ఎగువన ఎస్సారెస్పీ 26 గేట్లు ఎత్తడంతో భారీగా వరద వస్తోంది. మండలంలోని సదర్మాట్‌ వద్ద గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా.. ప్రస్తుతం 12 ఫీట్లలో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో దిగువకు 89,946 క్యూసెక్కుల వరద గోదావరిలోకి వెళ్తోందని సదర్మాట్‌ ఏఈఈ ఉదయ్‌ తెలిపారు. వరద కారణంగా ఖానాపూర్‌లోని వైకుంఠధామం నీట మునిగింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు..

ఖానాపూర్‌ మండలంలోని బావాపూర్(ఆర్)కు వెళ్లే రోడ్డు, తర్లపాడ్, పాతతర్లపాడ్‌ గ్రామాల మధ్య రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఖానాపూర్‌లోని సుభాష్‌నగర్, శ్రీరాంనగర్‌ కాలనీల్లో డ్రెయినేజీ సరిగా లేక నివాసాల్లోకి మురికి నీరు చేరింది. రాజీవ్‌నగర్, జేకేనగర్‌ కాలనీలతోపాటు మస్కాపూర్‌లోని మధురనగర్‌ కాలనీలను అటవీ ప్రాంతంలోని వరద చుట్టుముట్టింది. పట్టణంలోని జీపుఅడ్డా ప్రాంతంలో వరద పొంగిపొర్లింది.

సదర్మాట్‌ కాలువకు గండ్లు



ఖానాపూర్‌ శివారులో కాల్వకు పడిన గండి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల్లోని ఆయకట్టు రైతులకు సాగు నీటిని అందించే సదర్మాట్‌ కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. ఖానాపూర్‌–తర్లపాడ్‌ గ్రామాల మధ్య గల పెద్దన్న పంపు ఏరియాలోని సైఫాన్‌ ప్రాంతంలో రెండు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. దిలావర్‌పూర్‌ సమీపంలోని సదర్మాట్‌ కాలువ కోతకు గురైంది. గాంధీనగర్‌ శివారులో వాగు వద్ద కాలువపై నిర్మించిన వంతెన కుంగింది. సదర్మాట్‌ ఏఈఈ ఉదయ్‌ను వివరణ కోరగా.. గండ్లు పడిన చోట మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

చెరువులు పరిశీలన

నిర్మల్‌రూరల్: మండలంలోని అనంతపేట్, నీలాయిపేట్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో దెబ్బతిన్న చెరువులను శుక్రవారం ఎంపీపీ రామేశ్వర్‌ రెడ్డి పరిశీలించారు. అనంతపేట్‌ నుంచి భాగ్యనగర్‌ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ మండల కన్వీనర్‌ అల్లోల గోవర్ధన్‌ రెడ్డి, విలాస్, రాము, సాయన్న, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి జిల్లాలో వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్‌ కొట్టే శేఖర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దెబ్బతిన్న రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

ముధోల్: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్‌ వినోద్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం ఆయన ముధోల్‌ మాట్లాడారు. పేద ప్రజలు ఇబ్బంది పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు.

'చెక్కుల పంపిణీలో అక్రమాలు'

ఖానాపూర్: బీసీలకు అందించిన రూ.లక్ష సాయం చెక్కుల పంపిణీలో అక్రమాలు జరిగాయని మున్సిపల్‌ కాంగ్రెస్‌ పార్టీ ఫ్లోర్‌లీడర్‌ చిన్నం సత్యం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్‌ అన్నారు. చెక్కులు పంపిణీ చేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన డీఆర్వో లోకేశ్‌ను నిలదీశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రతిపాదించిన వారికే రుణాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు దయానంద్, యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు కిశోర్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌ పాషా, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్, తోట సత్యం, శ్యామ్‌ తదితరులు ఉన్నారు.

రోడ్లపై నడపొద్దు

సారంగపూర్: రబ్బరు తొడుగులు లేకుండా కేజ్‌ వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండలంలోని గోపాల్‌పేట్, బోరిగాం, జామ్, ధని, ఆలూరు గ్రామాల్లో ట్రాక్టర్ల యజమానులకు, రైతులకు అవగాహన కల్పించారు. కానిస్టేబుల్‌ మంగళ్‌సింగ్‌ తదితరులున్నారు.

గ్రామాల్లో డ్రై డే

కుంటాల: మండలంలోని ఓలా, కుంటాల గ్రామాల్లో శుక్రవారం ప్రజలకు సీజనల్‌ వ్యాధులపై ప్రత్యేకాధికారి మాసార్‌రావు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పారబోయించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ రహీం, సర్పంచులు సమత, ఫాతిమా, కార్యదర్శులు రాజబాపు, యోగేశ్‌ ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో డ్రైడే నిర్వహించారు. ఎంపీడీఓ సరోజ పాల్గొని సీజనల్‌ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మురికి కాలువల్లో బ్లీచింగ్‌ చేయించారు. ప్రధాన వీధులు పరిశీలించి కార్యదర్శి శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు.

పెంబి: గ్రామాల్లో మురికి నీరు నిల్వకుండా చూసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్‌ శ్రీధర్, ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంతోపాటు షెట్‌పల్లి, లోతర్యతండా గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. అనంతరం కడెం వాగుతోపాటు లోతర్యతాండ వద్ద కోతకు గురైన రోడ్డు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో దుకాణాల్లోకి బురద



దుకాణంలో బురద తొలగిస్తున్న భోజన్న



తడిసిన సరుకులు ఆరబెడుతున్న సిబ్బంది

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద ధాటికి దిగువన సుద్దవాగు పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు నష్టపోగా, పశువులు మృత్యువాత పడ్డాయి. పట్టణంలోని వివేకానంద చౌరస్తా, వినాయక్‌ నగర్‌లోని దుకాణ సముదాయాల్లోకి వరద చేరడంతో దుకాణదారులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఎలక్ట్రానిక్, కిరాణం, ఆటో మొబైల్, స్టేషనరీ దుకాణాల్లో బురద వెళ్లడంతో వస్తువులు పూర్తిగా తడిసిపోయాయి. ఆటోనగర్‌ బైపాస్‌ వంతెన పక్కన మల్లేశ్వర్‌కు చెందిన మూడు పశువులు మృత్యువాత పడగా తొమ్మిది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

సారంగపూర్‌ మండలంలో నష్టం



మలక్‌చించోలి–కౌట్ల(బి) గ్రామాల మధ్య రోడ్డు



కంకెటలో ఈఈతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పరివాహక ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయి. మలక్‌ చించోలి–కౌట్ల(బి) గ్రామాల మధ్య రోడ్డు, వంతెన కోతకు గురైంది. కంకెట–వైకుంఠాపూర్‌ గ్రామాల మధ్య ఉన్న లోలెవల్‌ వంతెన దోనిగాం ప్రాజెక్టు వరద తాకిడికి కోతకు గురైంది. బీరవెల్లి–లోలం గ్రామాల మధ్య రోడ్డు, హనుమాన్‌తండా సమీపంలో రోడ్డు కోతకు గురయ్యాయి. జౌళి, నారాయణపల్లిలో విద్యుత్‌ వ్యవస్థ దెబ్బతింది. ఈ గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్‌ సరఫరా నిలిచిపోగా ఏఈ సాయికిరణ్‌ ఆధ్వర్యంలో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

పరిహారం చెల్లించాలి..

వరదలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మండలంలోని బీరవెల్లి, కంకెట, స్వర్ణ, మలక్‌చించోలి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. కంకెట గ్రామంలో కోతకు గురైన వంతెన, మలక్‌చించోలి రోడ్డు, స్వర్ణ ప్రాజెక్టు, నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్‌ ఈఈ రామారావుతో మాట్లాడారు. సర్వే చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలో అక్రమ నాలాల కారణంగానే ఇళ్లలోకి వరద వస్తోందన్నారు. అయ్యన్నగారి భూమయ్య, మల్లికార్జున్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, విలాస్, వెంకటేశ్,రాంనాథ్, తదితరులు ఉన్నారు. మలక్‌చించోలి, కంకెట గ్రామాల్లో రోడ్లను ఎంపీపీ మహిపాల్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

వెంటనే మరమ్మతులు చేయిస్తాం

- అదనపు కలెక్టర్‌ కిశోర్‌



రోడ్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ కిశోర్‌

తానూరు: ప్రజలు ఆందోళన చెందవద్దని.. రోడ్లకు మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యాలను పునరుద్ధరిస్తామని అదనపు కలెక్టర్‌ ఎల్‌.కిశోర్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని బెల్‌తరోడా సట్వాజీ వాగు సమీపంలో కోతకు గురైన రెండు వరుసల రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. రోడ్డు కోతకు గురవడంతో భైంసా–మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయని ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు వివరాలు తహసీల్దార్‌ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐ గంగాధర్, చంద్రకాంత్‌యాదవ్‌ తదితరులు ఉన్నారు.

వివరాలు నమోదు..

మండలంలోని దౌలతాబాద్, ఖర్బాలా, కొలూరు గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌ పర్యటించారు. కోతకు గురైన రోడ్లు, దెబ్బతిన్న ఇళ్ల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీవో మోహన్‌సింగ్, కార్యదర్శులు లక్ష్మణ్, జీవన్‌ తదితరులు ఉన్నారు.

బాధితులకు పరిహారం అందించాలి

బాధితులకు పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావ్‌ పటేల్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం మండలంలోని బోల్సా గ్రామంలో ఆయన పర్యటించి వరద చేరిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తమ వంతుగా గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. వారి వెంట చక్రధర్‌పటేల్, శివాజీ పటేల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: బీఆర్‌ఎస్‌ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు సమష్టిగా ముందుకు సాగాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని కొండాపూర్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో శుక్రవారం నిర్మల్‌ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టడం, సోషల్‌ మీడియాలో ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం రాక ముందు.. ఇప్పుడున్న పరిస్థితులను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్మన్‌ గండ్రత్‌ ఈశ్వర్, అప్పల గణేష్, రాం కిషన్‌ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ ఎర్రవోతు రాజేందర్, ధర్మాజీ రాజేందర్, బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు రాము, అల్లోల మురళీధర్‌ రెడ్డి, ఆమెడ కిషన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్నూరు కాపు మిత్రమండలి

ఇటీవల ఎన్నికైన నిర్మల్‌ మున్నూరు కాపు మిత్రమండలి యువజన కార్యవర్గం మంత్రిని జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. పలు సమస్యలు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు గంట రాకేశ్, ఉపాధ్యక్షులు నరేందర్, మరుకుంట అనిల్‌ ప్రవీణ్, సందీప్, శివకుమార్, చిరంజీవి, చంద్రశేఖర్‌ తదితరులు ఉన్నారు.

బీసీ రుణాల చెక్కులు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్‌

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం చెక్కులను ఎమ్మెల్యే రేఖానాయక్‌ మండలంలోని 50 మందికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం రుణం అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు మండలంలోని పాత తర్లపాడ్, గోసంపల్లె, గోడలపంపు, దిలావర్‌పూర్‌ గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో పుప్పాల శంకర్, వాల్‌సింగ్, అంకం రాజేందర్, గౌరై గంగాధర్, పార్శపు శ్రీనివాస్, ఇన్‌చార్జ్‌ డీఆర్వో లోకేశ్, ఎంపీడీవో మల్లేశ్‌ తదితరులు ఉన్నారు.

ముత్యాల పోచమ్మ పండుగ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్‌ కాలనీ ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శనం కల్పించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.